▪ వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే...

కొడంగల్, ఫిబ్రవరి 11: మండల పరిధిలో జరిగిన ఓ వివాహ వేడుక లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

▪ ఘనంగా ఆత్మార్పణదినోత్సవం

శ్రీ నగరేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

కొడంగల్, ఫిబ్రవరి 11: శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక నగరేశ్వరస్వామి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శివలింగానికి పంచామృతాలతో అభిషేం, అమ్మవారికి కుంకు మార్చన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహసభ జిల్లా అధ్యక్షుడు కటకం శివకుమార్ మహిళా సంఘం అధ్యక్షులు కటకం స్వప్న, వాసవిక్లబ్ అధ్యక్షుడు కటకం రాఘవేందర్, సెక్రెటరీ రాము, కోశాధికారి సాయికిశోర్‌తో పాటు కొత్త ఎల్లయ్య, పూరి శేఖర్, చిదిరి వీరేశ్, కటకం ఆంజనేయులు, పట్నం మనోజ్‌కుమార్, కటకం సవిత, మమత పాల్గొన్నారు.

▪ గృహజ్యోతికి వివరాలు సేకరణ

వివరాలను సేకరిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ స్వాతి

పెద్దేముల్, ఫిబ్రవరి 11 : గృహజ్యోతి పథకానికి సంబంధించిన వివరాలను విద్యుత్ వినియోగదారులు అధికారులకు అందించాలని మండల విద్యుత్ లైన్‌ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపారు.ఆదివారం మండల కేంద్రంలో గ్రామస్తుల నుంచి సిబ్బందితో కలిసి వివరాలు సేకరించారు. కరెంట్ బిల్లు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్‌ల తో పాటు ప్రజాపాలన రశీదు వివరాలను విద్యుత్ సిబ్బందికి అందజేయాలని సూచించారు.ఈ నెల 15వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వివరించారు. కార్యక్ర మంలో తాండూరు డీఈ ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్ స్వాతి, వీరప్ప పాల్గొన్నారు.

▪ ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

కొడంగల్, ఫిబ్రవరి 11: స్థానిక మహాత్మాజ్యోతీబాపూలే గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శంకర్ బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష కోసం సెంటర్‌లో 240 మంది విద్యార్థులు ఆలాట్ కాగా 227 మంది హాజరైనట్లు తెలిపారు.

▪ 97 శాతం గ్యాస్ కనెక్షన్ డేటా పూర్తి

గ్యాస్ కనెక్షన్ డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న తహసీల్దార్ గణేశ్

మర్పల్లి, ఫిబ్రవరి 11: మండలంలో గ్యాస్ కనెక్షన్ డాటా 97 శాతం పూర్తయినట్లు తహసీల్దార్ గణేశ్ తెలిపారు. ఆదివారం కల్‌ఖోడా గ్రామంలో గ్యాస్ కనెక్షన్ డేటా ఎంట్రీ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో 3,718 గ్యాస్ కనెక్షన్లు అప్‌డేట్ చేశామని, ఇంకా 127 ఎంట్రీ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చందు ఉన్నారు.

▪ వికాకాబాద్ ఎంపీడీవో బదిలీ

వికారాబాద్, ఫిబ్రవరి 11 : వికారాబాద్ ఎంపీడీవో సత్తయ్య సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం ఈ నిర్ణయం జరిగినట్టు సమాచారం. దాదాపు 5 సంవత్సరాల పాటు వికా రాబాద్ ఎంపీడీవోగా ఆయన పని చేశారు. ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి మెలసి అభివృద్ధి పనులు చేశారు. ప్రభుత్వం పథకాలను ప్రజలకు చేరే విధంగా కృషి చేశారు.



దోమ, ఫిబ్రవరి 11: మండల పరిధిలోని పాలేపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ యశోధాతిరుపతయ్యను పదవీ విరమణ సందర్భంగా శ్రీ రామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో వరవీరాంజనేయ స్వామి సన్నిధిలో శనివారం రాత్రి ఘనంగా సత్కరించారు.

ఘనంగా షిర్డీ సాయి మందిర వార్షిక ఉత్సవాలు

పరిగి, ఫిబ్రవరి 11: పరిగి పట్టణంలోని శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరం 20వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రెండవ రోజు ఆదివారం ఉదయం 5.15 గంటలకు కాగడ హారతి, 6 గంటలకు సుప్రభాతము, 7 గంటలకు అభిషేకం, 9 గంటలకు స్వామి వారికి ఉచిత సామూహిక సాయి వ్రతములు, 10 గంటలకు స్వామి వారికి చందనోత్సవం, ఉదయం 11.30 గంటలకు సాయి సేవకులచే సత్సంగం, అనంతరం సాయి సేవక్ సాయి పురోహిత్ చే ప్రసంగ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు సాయి బాబాకు హారతి, సాయంత్రం 4 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పుష్పాభిషేకం, సాయంత్రం 7.15గంటలకు శ్రీ శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు 'ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి' అఖండ సాయినామ సంకీర్తన జరిగింది.

షిర్డీ సాయిబాబా ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఉత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ వారు ఘనంగా సన్మానించారు. ఉత్సవాలలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, జడ్పీటీసీ బి.హరిప్రియ-ప్రవీణ్‌కుమార్‌రెడ్డి దంపతులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు ఎస్పీ బాబయ్య, ఆర్.ఆంజనేయులు, నాయకులు ఎస్.భాస్కర్, కృష్ణ, పాలాది శ్రీనివాస్, బి.రవికుమార్, హన్మంతు పాల్గొన్నారు.

భావి తరాలకు మహనీయుల చరిత్ర తెలియాలి

బషీరాబాద్, పిబ్రవరి 11: భావి తరాలకు మహనీయుల చరిత్ర తెలియజేయాలన్న గొప్ప లక్ష్యంతో నియోజకవర్గ పరిధిలో విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నీళ్లపల్లి, గొట్టిగఖుర్దు, కంసాన్‌పల్లి(ఎం) గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రజలకు నిస్వార్థ సేవలందించిన గొప్ప మహనీయుడు ఛత్రపతి మహారాజ్ అన్నారు. శివాజీ పరిపాలన, విధానాలు, వ్యక్తిత్వాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరూ అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నర్సిరెడ్డి (రాజు), భవానిమాత ఆలయ పీఠాధిపతి శంకర్‌స్వామి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, ముకుంద్, బసంత్, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ఆటల్లో గెలుపోటములు సహజం

విజేతలకు టోర్నీ అందిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, ఫిబ్రవరి 11 ఆటల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బాబునాయక్‌తండాలో నిర్వహించిన బీఎంఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విన్నర్, రన్నర్‌లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు రామునాయక్, చందర్, శంకర్ ఉన్నారు.

రేపు కొడంగల్‌లో ఉచిత కంటి పరీక్షా శిబిరం

కొడంగల్, ఫిబ్రవరి 11: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 13వ తేదీన లయన్స్‌క్లబ్ ఆఫ్ కొడంగల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, చైర్మన్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, కందూరి రాంరెడ్డి కంటి ఆసుపత్రి ఏనుగొండ, కొడంగల్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తారని, శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్యాంపునకు హాజరయ్యే వారు తప్పకుండా ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌ల తీసుకురావాలని తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కులకచర్ల, ఫిబ్రవరి 11: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కులకచర్ల ఎంపీవో కరీమ్ అన్నారు. ఆదివారం ముజాహిద్‌పూర్ గ్రామంలో ప్రత్యేక అధికారిగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్యపు పనులను పరిశీలించి కార్మికులకు, గ్రామస్తులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్ క్లీనింగ్, పైప్‌లైన్ లీకేజీ పనులు, మోడల్ స్కూల్‌కు వెళ్లే దారిలో క్లీనింగ్ పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

లేబర్ కార్డులను వినియోగించుకోవాలి

హెల్త్‌క్యాంపును ప్రారంభిస్తున్న రజక సంఘం నాయకుడు మొత్కూర్ వెంకటేశ్

కులకచర్ల, ఫిబ్రవరి 11 : కార్మికులందరూ లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని జనస హాస్ స్వచ్ఛంద సంస్థ మండల కో-ఆర్డినేటర్ రవీందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీఏసీసీ లేబర్ డిపార్ట్‌మెంట్, జన్‌సహాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబి రాన్ని రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ప్రారంభించారు. అనంతరం వారు కార్మికులకు లేబర్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు లేబర్ కార్డు ద్వారా 50 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, కార్మికులకు ఇన్సూరెన్స్‌తో పాటు కుటుంబంలో ఇద్దరు కుమార్తెల వివాహాలకు ఒక్కొక్కరికీ రూ. 30 వేల చొప్పున, ఇద్దరు కుమార్తెల ప్రసవానికి ఒక్కొక్కరికీ రూ.30వేల ఆర్థిక సాయం అందుతుందన్నారు. లేబర్ కార్డు ఉన్న వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 6లక్షల వరకు వస్తాయని.. సాధారణ మర ణానికి రూ. లక్షా30వేలు, అంగవైకల్యం చెందితే రూ. 5లక్షల వరకు లేబర్ డిపార్ట్‌మెంట్ నుంచి సాయం అందుతుందన్నారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు జన్‌సహాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో హెల్త్‌క్యాంప్ కో-ఆర్డినేటర్ విష్ణువర్ధన్, సిబ్బంది వెంకటేశ్, శిరీష, నరేందర్, జయసుధ, అనిల్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

▪ ధ్యానం సర్వరోగ నివారిణి

పరిగి, ఫిబ్రవరి 11: ధ్యానం సర్వరోగ నివారిణి అని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త రాధ పేర్కొన్నారు. ఆదివారం పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి, నారాయణపూర్, ఎర్రగడ్డపల్లి, సుల్తాన్‌నగర్, సుల్తాన్‌పూర్ గ్రామాలలో నిర్వహించిన ధ్యానంపై అవగాహన సదస్సులలో వారు పాల్గొని మాట్లాడుతూ శరీరంలో ఉన్న ఎలాంటి రోగాలనైనా తగ్గించడంతోపాటు భవిష్యతులో రోగాలు రాకుండా ధ్యానం కాపాడుతుందని చెప్పారు. నిత్య జీవితంలో అనేక సమస్యలతో సతమతమవుతూ ఒత్తిడికి గురయ్యే వారికి ధ్యానం మానసిక ప్రశాంతతను చేకూరుస్తుందని చెప్పారు. పిరమిడ్ ద్వారా, సామూహిక ధ్యానం ద్వారా మూడు రెట్లు శక్తిని అధికంగా పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, లావణ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న బైకు వ్యక్తి మృతి

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 11 : ఆగిఉన్న లారీని బైకు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగడిమైలారం గ్రామానికి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై అబ్దుల్ రవూఫ్ కథనం ప్రకారం కొడంగల్ మండలం బుర్హుఖాన్‌పల్లి గ్రామానికి చెందిన నందిపాడ్ కృష్ణ(35) ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో బైకుపై కొడంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. రేగడిమైలారం సమీపంలోని ఈడిగోనిగడ్డ వద్ద ఆగిఉన్న లారీని వెనుక నుంచి బైకు ఢీకొనడంతో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవూఫ్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ కొని వ్యక్తి మృతి

కులకచర్ల, ఫిబ్రవరి 11 : రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కులకచర్ల మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన బాలకృష్ణ(21) శనివారం రాత్రి తన బైక్‌పైన కులకచర్లకు వస్తున్న సమయంలో కులకచర్ల నుంచి బండవెల్కిచర్ల వైపు వస్తున్న బైక్ బాలకృష్ణను బొంరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు దగ్గర ఢీకొన్నది. దీంతో బాలకృష్ణకు తీవ్రగాయాలు కాగా మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ... ముగ్గురికి తీవ్ర గాయాలు

పరిగి టౌన్, ఫిబ్రవరి 11 : బైక్‌ను లారీ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన పరిగి సమీపంలోని గడిసింగాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం..దోమ మండల పరిధిలోని గూడురు గ్రామానికి చెందిన గంజి శ్రీనివాస్(35) మాజీ ఉప సర్పంచ్, కొవ్వూరి శ్రీనివాస్(33), కొవ్వూరి అఖిల్(10) కలిసి బైక్‌పై తాండురు నుంచి పరిగి వైపు వస్తుండగా గడిసింగాపూర్ గ్రామ మూలమలుపు దగ్గర లారీ ఢీకొంది. దీంతో ముగ్గురికి కుడికాళ్లు విరిగాయి. వెంటనే అంబులెన్స్‌లో పరిగి సర్కారు దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా... ఏడుగురికి గాయాలు

యాలాల, ఫిబ్రవరి11: ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు అయిన ఘటన ఆదివారం యాలాల మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామ గేటు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం...ఆటో డ్రైవర్ మేకల రాజు ముద్దాయిపేట గ్రామం నుంచి తాండూరు వైపునకు వెళ్తున్న క్రమంలో అచ్యుతాపూర్ గేటు ప్రాంతం వచ్చేసరికి బోల్తా పడి ఏడుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. శాంతాబాయి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాస్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వికారాబాద్, ఫిబ్రవరి 11 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామానికి చెందిన బిల్లాపాటి బీరయ్య(35) తండ్రి మాణయ్య, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శనివారం వికారాబాద్ నుంచి తన బైకుపై నవాబ్ పేట్ వెళ్తుండగా మార్గమధ్యంలో ఎక్‌మామిడి గ్రామ సమీపంలోని మసీదు దగ్గర ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బీరయ్య తీవ్ర గాయాలు అయ్యాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించినట్లు మృతుడి భార్య బిల్లపాటి అంజుల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహిత అదృశ్యం ...

తాండూరు రూరల్, ఫిబ్రవరి 11: వివాహిత అదృశ్యమైన ఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం ప్రకారం...తాండూరు మండలం, గౌతాపూర్‌లోని నాగేశ్వర్‌రావు పాలిషింగ్‌యూనిట్‌లో కోడంగల్ మండలం, రుద్రారం గ్రామానికి చెందిన అడిక ఆశప్ప, భార్య లక్ష్మి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ముగ్గురు సంతానం. ఈ నెల 9వ తేదీన ఆరోగ్యం బాగాలేదని దవాఖానాకు వెళుతానని చెప్పి ఇంట్లో నుంచి లక్ష్మి వెళ్లిపోయింది. తాండూరు పట్టణంలోని ప్రభుత్వ దవాఖానాతోపాటు చుట్టూ పక్క ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్, ఫిబ్రవరి 11: మండలంలోని చిట్లపల్లి గ్రామంలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ. 45లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపడు తున్నట్లు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ తెలిపారు. ఆదివారం చిట్లపల్లి గ్రామంలో ఆయన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయోధ్యకు మర్పల్లి వాసులు..

మర్పల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన హిందూ ఉత్సవ సమితీ సభ్యులు ఆదివారం అయోధ్యకు బయలుదేరారు. హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి మర్పల్లి నుంచి సికింద్రబాద్‌కు బస్సులో వెళ్లి అక్కడనుంచి రైలులో వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. అయోధ్య వెళ్తున్న వారిలో బీజేపీ జిల్లా సెక్రేటరీ మల్లేం, సలీం, రామేశ్వర్ రెడ్డి, రఘుపతి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, లడ్డు పటేల్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కులకచర్ల నుంచి..

కులకచర్ల, ఫిబ్రవరి 11 : అయోధ్య రాముడి దర్శనానికి కులకచర్ల మండలం నుంచి 20మంది భక్తులు ఆదివారం అయోధ్యకు బయలు దేరి వెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్ ఆధ్వర్యంలో అయోధ్యకు వెళ్లారు. అయోధ్యకు వెళ్లుతున్న భక్తులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కులకచర్ల నుంచి అయోధ్యకు వెళుతున్న భక్తులు

రౌడీషీటర్లకు వార్నింగ్

తాండూరు రూరల్, ఫిబ్రవరి 11 : తాండూరు మండలం, కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను ఎస్సై విఠల్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం రౌడీషీటర్లను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్‌ప్రవర్తనతో ఉండాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలిపారు.

పరిగి సీఐ, ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

సీఐ శ్రీనివాస్

ఎస్ఐ సంతోష్

పరిగి, ఫిబ్రవరి 11: పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గద్వాల నుంచి పరిగికి బదిలీ పై వచ్చారు. పరిగిలో సీఐగా పనిచేసిన వెంకట్రామయ్య ఐఎస్ సదన్ కు బదిలీ అయ్యారు. పరిగి ఎస్ఐగా సంతోష్‌కుమార్ ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన ధారూర్ పోలీస్ స్టేషన్ నుంచి పరిగికి బదిలీపై వచ్చారు. పరిగి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్ కుమా ర్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

यूनियन बैंक ऑफ इंडिया భారత సర్కార్ का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)

అస్సెట్ రికవరీ శాఖ
#249/3RT, 1వ అంతస్తు, S.R. నగర్ మెయిన్ రోడ్, హైదరాబాద్ - 500 038.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

[సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధన చూడండి]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటార్(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు దిగువ తెలిపిన బకాయిలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే లాంఛనప్రాయ/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి **''ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా'', ''ఏది వుంటే అది'' మరియు ''అక్కడ ఏమున్నదో అదే''** ప్రాతిపదికన దిగువ తెలిపిన తేదీన విక్రయించబడుతుందని ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు గ్యారంటార్(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
రిజర్వు ధర మరియు బయానా వివరాలు కూడా దిగువ తెలియజేయబడినవి.

రుణగ్రహీత పేరు మరియు చిరునామా: శ్రీ D. శ్రీనివాస్, తండ్రి దొడ్డికాడి బాసయ్య, ప్లాట్ నెం. 273 LP No. 9/2011/H, సూర్యప్రకాష్ నగర్ శాటిలైట్ టౌన్‌షిప్, ఎన్నేపల్లి, వికారాబాద్-501101. **కో-అప్లికెంట్: శ్రీమతి D. కళావతి, భర్త D. శ్రీనివాస్,** ప్లాట్ నెం. 273 LP No. 9/2011/H, సూర్యప్రకాష్ నగర్ శాటిలైట్ టౌన్‌షిప్, ఎన్నేపల్లి, వికారాబాద్-501101. **కో-ఆబ్లిగెంట్: శ్రీ జోగి మహదేవ్, తండ్రి జోగి తుల్జారామ్,** డి.నెం.1-26/C, జోగివాడ, ఎక్మయి, బషీరాబాద్, వికారాబాద్ -501143.
విక్రయించబడుతున్న స్థిర సెక్యూర్డ్ ఆస్తి నుండి రాబట్టుకోవలసిన సెక్యూర్డ్ రుణం: 31-12-2023 నాటికి **రూ. 31,75,872.70 (ముప్పై ఒక్క లక్షల డెబ్బై ఐదు వేల ఎనిమిది వందల డెబ్బై రెండు రూపాయల డెబ్బై పైసలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ, వ్యయాలు & ఖర్చులు.

విక్రయించబడుతున్న స్థిర సెక్యూర్డ్ ఆస్తుల వివరణ

D.శ్రీనివాస్, తండ్రి D.బాసయ్యకు చెందిన, R.R.జిల్లా, వికారాబాద్ మున్సిపాలిటీ & మండలం, ఎన్నేపల్లి గ్రామం, సూర్యప్రకాష్ శాటిలైట్ టౌన్‌షిప్ వద్దగల నార్త్ సౌత్ 50' x ఈస్ట్ వెస్ట్ 36' = 1800 చ.అడుగులు లేదా 200 చ.గజాలు లేదా 167.22 చ.మీటర్ల విస్తీర్ణం, సర్వే నెం. 108/1 & 108/4లో నివాస ప్లాట్ నెం. 273, LP No. 9/2011/H - భూమి మరియు భవనం యావత్తు (RSD 1783/2012) 11-04-2012 SRO వికారాబాద్) మరియు **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నెం. 272, పడమర: ప్లాట్ నెం. 274, ఉత్తరం: ప్లాట్ నెం. 270, దక్షిణం: 40 అడుగుల వెడల్పు రోడ్.
సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 1783/2013 @ SRO వికారాబాద్ గూగుల్ కో-ఆర్డినేట్స్: 17.31326, 77.91151

రిజర్వు ధర: రూ. 46,24,000/- బయానా: రూ.4,63,000/- బిడ్ పెంపుదల: రూ. 46,500/-

తేది: 09-02-2024 తదుపరి వివరాలకు సంప్రదించండి: **9440865128**

ఇ-వేలం తేది మరియు సమయం: 28-02-2024న మ॥ 12.00 గం. నుండి సా॥ 5.00 గం. మధ్య (10 నిమిషాల అపరిమిత ఆటో ఎక్స్‌టెన్షన్స్‌తో). ఇ-వేలం వెబ్‌సైట్ : www.mstcecommerce.com

బయానా దాఖలు కొరకు ఆఖరి తేది ఇ-వేలం సమయం వరకు

పై ఆస్తుల తనిఖీ తేది & సమయం: 17-02-2024న మ॥ 1.00 గం. మరియు సా॥ 5.00 గం. మధ్య

అమ్మకం సవివరమైన నియమ నిబంధనల కొరకు **https:"www.unionbankofindia.co.in, https:"www.mstcecommerce.com/auctionhome/ ibapi/index.jsp"**లో ఏర్పాటు చేయబడిన లింక్ చూడగలరు. రిజిస్ట్రేషన్, లాగిన్ మరియు బిడ్డింగ్ నియమాల కొరకు దర్శించండి: **https:" www.mstcecommerce.com/ auctionhome/ibapi/index.jsp".** ఆసక్తిగల బిడ్డరు **అధీకృత అధికారులు** 249/3RT, 1వ అంతస్తు, మెయిన్ రోడ్, SR నగర్, హైదరాబాద్ - 500 038, తెలంగాణ వారిని సంప్రదించవచ్చును. మొబైల్ నెం. **9391315006, 9849365426.**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధ 15 రోజుల అమ్మకం ప్రకటన
పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/లు మరియు గ్యారంటార్/లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద నోటీసుగా కూడా దీనిని పరిగణించవలెను.

అధీకృత అధికారి,
ప్రదేశం: హైదరాబాద్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ శాఖ